పార్క్‌లు సరే.. రోడ్లు ఏవీ?

- అధ్వానంగా గోళ్లపాడు చానల్ పక్కన రోడ్లు
- రహదారి సక్రమంగా లేక స్థానికుల ఇక్కట్లు
- ఇకనైనా రోడ్లు నిర్మించాలని డిమాండ్

ఖమ్మంమయూరిసెంటర్: ఏళ్లుగా మురికి కూపంగా ఉన్న గోళ్లపాడు చానల్‌ను ఆధునీకరించారు. అండర్ డ్రైనేజీని ఏర్పాటు చేసి, పైన పార్కులను నిర్మించారు. అయితే కాలువ పక్కన ఉన్న రహదారులకు మాత్రం మరమ్మతులు చేయలేదు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గోళ్లపాడు చానల్ ఆధునీకరణ సమయంలో కాలువ పక్కన ఉన్న రోడ్లు మరమ్మతు కు గురయ్యాయి. రోడ్లన్నీ గుంతలు పడి అధ్వానంగా ఉన్నాయి. కాలువను ఆధునీకరించిన పాలకులు పక్కన ఉన్న రోడ్లను గాలికొదిలేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంపింగ్‌వెల్ రోడ్డు, సుందరయ్యనగర్, మోతినగర్ ప్రాంతాల్లో గోళ్లపాడు ఛానల్ పక్కన రోడ్లపై వాహనాలు నడపాలన్నా.. ఆ రోడ్డు మార్గాన ప్రధాన రహదారిపైకి రావాలన్న తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అనేక మంది కిందపడిన సంఘటనలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

నడిచేందుకు వీలు లేకుండా..

గోళ్లపాడు కాలువ ఆధునీకరణలో భాగంగా పక్కన ఉన్న రోడ్డు మార్గాన్న వ్యర్థాలను, మట్టిని బయటకు తరలించారు. ఆ రోడ్లపై ప్రొక్లెన్, జేసీబీ వంటి భారీ వాహనాలు తిరగడంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో గోళ్లపాడు చానల్ పక్కన రోడ్లు గతుకుల రోడ్లుగా మారడంతో నడిచేందుకు వీలులేకుండా పోయింది. కాలువలను ఆధునీకరించి పార్కులు నిర్మించి చాలా కాలం అయినప్పటికీ ఇప్పటి వరకు పక్కన రోడ్లకు మరమ్మతులు చేయలేదు. కాలువను ఆధునీకరించి సుందరమైన పార్కులను నిర్మించినప్పటికీ పక్కన రోడ్లు సక్రమంగా లేకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గోళ్లపాడు చానల్‌కు పక్కన ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని, కొత్త రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



పంపింగ్‌వెల్ రోడ్డులో పార్క్ పక్కన దెబ్బతిన్న రోడ్డు



కొండా లక్ష్మణ్ బాపూజీ పార్క్ సమీపాన..



రంగనాయికుల గుట్ట సమీపాన ఉన్న పార్క్ వద్ద..

రోడ్డును వదిలేశారు..



ప్రకాశ్‌నగర్ నుండి ఎఫ్‌సీఐ గోదాం వరకు గోళ్లపాడు చానల్ పక్కన రోడ్డు అధ్వానంగా ఉంది. సుందరమైన పార్క్‌లు కట్టించిన గత పాలకులు రోడ్డును మరిచారు. పిల్లలు, పెద్ద వయసు వారు నడవాలంటే ఇబ్బందిగా ఉంది. కాల్వ పక్కన కొత్త రోడ్లు నిర్మించాలి.

– మద్ది శ్రీనివాస్, స్థానికుడు

అంతా గుంతలమయం



కాల్వను అభివృద్ధి చేశారు కానీ రోడ్లను అభివృద్ధి చేయలేదు. త్రీటౌన్ ప్రాంతంలో గోళ్లపాడు చానల్ పక్కన రోడ్లన్నీ గుంతలమయంగా ఉన్నాయి. ఈ గుంతల్లో పడి అనేక మంది గాయపడ్డారు. ఇకనైనా ఈ ప్రాంతంలో రహదారులు అభివృద్ధి చేయాలి.

– రంగు హన్మంతాచారి, స్థానికుడు

నానా అవస్థలు పడుతున్నాం..



కాల్వ అభివృద్ధి పేరుతో రోడ్డును ధ్వంసం చేశారు. కాల్వ అభివృద్ధి, పార్క్‌ల నిర్మాణంతో పాటు రోడ్డు నిర్మించాల్సి ఉన్నా పట్టించుకోలేదు. సైకిల్ కూడా తొక్కలేని పరిస్థితి ఉండగా, స్కూల్ పిల్లలు అవస్థ పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించాలి.

– జిల్లేపల్లి సతీష్, స్థానికుడు

క్లుప్తంగా

నేడు పాలేరులో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంరూరల్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమలాయపాలెంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, అనంతరం కూసుమంచి క్యాంప్ ఆఫీసులో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయడంతో పాటు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. వెంకటగిరిలో మినీ క్రీడా మైదానం నిర్మాణానికి శంకుస్థాపన చేసి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తారని, దానవాయిగూడెం 59వ డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మేడారం జాతరలో సేవలకు సన్మానం



108 అధికారులతో జాతరలో విధులు నిర్వర్తించిన ఉద్యోగులు

రఘునాథపాలెం: ములుగు జిల్లా మేడారంలో ఇటీవల జరిగిన సమ్మక్క – సారలమ్మ జాతరలో భక్తులకు అత్యవసర వైద్యం అందించడానికి రఘునాథపాలెం మండలానికి చెందిన 108 అంబులెన్స్‌ను కేటాయించారు. ఈసందర్భంగా ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు తుమ్మ జగదీష్, కొత్తపల్లి సతీష్ పైలట్లు చిర్రా రాంప్రసాద్, పాలడుగు రామకృష్ణ అక్కడ విధులు నిర్వర్తించారు. ఈ మేరకు ఉత్తమ సేవలందించడంతో ఉన్నతాధికారులు వీరిని జాతర ముగింపు రోజున సన్మానించారు.

5న చెరుకు క్రషింగ్ ముగింపు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో ఉన్న మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండ్రస్టీస్ లిమిటెడ్‌లో చెరుకు క్రషింగ్‌ను వచ్చే నెల 5న ముగిస్తున్నట్లు యాజమాన్య బాధ్యులు ఒక ప్రకటనలో వెల్లడించారు. 2023–24 సంవత్సరానికి గానుగ ఆడించేందుకు వచ్చేనెల 5తో గడువు నిర్ణయించినట్లు తెలిపారు. ఆ సమయంలోగా రైతులు ఫ్యాక్టరీకి చెరుకు తరలించాలని, ఆతర్వాత మిగిలితే ఫ్యాక్టరీకి బాధ్యత ఉండదని పేర్కొన్నారు.

ఆర్థికసాయం

తిరుమలాయపాలెం: అనారోగ్యంతో మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచి మంగళవారం ఆర్థిక సాయం అందించారు. మండలంలోని పిండిప్రోలులో మీగడ మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మల్లయ్యతో పాటు చదువుకున్న తోటి స్నేహితులు బాధిత కుటుంబానికి రూ.11,500తోపాటు బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో దొండేటి సురేష్, బూర్లె లక్ష్మినారాయణ, దొండేటి కిషోర్, కొంపల్లి నాగేశ్వరావు, కమ్మ కోమ్మటి రమా దేవి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఊరుపేరు భైరవకోన
వినోద	సుందరం మాస్టర్
సాయిరాం	సిద్దార్థ రాయ్
ఆదిత్య	భ్రమయుగం
శ్రీనివాస	ఈగల్
సుందర్	హను–మాన్

– ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	16	బచ్చలికూర	3
వంకాయ	56		20
బెండకాయ	46	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	56	చుక్కకూర	3
బీర	40		20
దొండ	34	తోటకూర	2
పొట్లకాయ	46		10
చిక్కుడు	100	గోంగూర	2
గోరుచిక్కుడు	50		10
క్యాబేజీ	34	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	35		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	60		30
క్యారెట్	38	పుదీన	1
క్యాప్సికం	60		20

–ఖమ్మం వ్యవసాయం

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ శేషాద్రి తదితరులు

తిరుమలాయపాలెం: మార్చి 3 ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియో మండల లెవల్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శేషాద్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 0–5 పిల్లలకు వందశాతం పోలియో చుక్కలు వేయాలని, ఇతర ప్రాంతాల నుండి వచ్చి, ఇటుక బట్టీల్లో, మిర్చి తోటల్లో, ఇతర పనులు చేయడానికి వచ్చిన వారి కుటుంబాలలో పిల్లలకు కూడా వేయాలని తెలిపారు. కూడా పల్స్ పోలియో జరిగే 3, 4, 5 తారీఖుల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామారావు, డాక్టర్ శ్రీధర్ విద్యుత్ శాఖ ఏఈలు శంకర్, రవికుమార్, సీడీపీఓ బాలత్రిపుర సుందరి ఎంపీఓ రాజేశ్వరి హెల్త్ సూపర్ వైజర్స్ నరేష్, రామయ్య పాల్గొన్నారు.

నేటి నుండి కరుణగిరి మహోత్సవాలు

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేటలో ఉన్న కరుణగిరి చర్చిలో బుధవారం నుండి కరుణగిరి మహోత్సవాలు నిర్వహించనున్నట్టు కరుణగిరి చర్చి డైరెక్టర్ మాత్యూవరప్రసాద్‌కరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసినట్లు, ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు హాజరవుతున్నట్లు తెలిపారు.

బహిరంగ సభలను జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా విలీన మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. తెట్టెలపాడు గ్రామంలో మోటార్ సైకిల్ ప్రదర్శనను పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ కొండమీది నరసయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు మాట్లాడుతూ... విప్లవకారులంతా ఐక్యమై దేశంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రేపాకుల శివలింగం మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, తిమ్మిడి హనుమంతరావు, ఎడ్లపల్లి నవీన్, ఆరేంపుల వెంకన్న, గొడుగు విజయ్, పులిగుజ్జు వెంకటస్వామి, కొత్తపల్లి వెంకట్ రెడ్డి, వెన్నబోయిన శ్రీనివాస్, పసలాది వెంకన్న, అరుణోదయ పాలేరు డివిజన్ కార్యదర్శి కత్తుల మల్లయ్య, శ్రీకాంత్. పి.వీరబాబు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు..



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిషిత శర్మ

ఖమ్మంక్రైం: ప్రతీ విద్యార్థి ఉత్తమ విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ స్కూల్ చైర్ పర్సన్ నిషిత శర్మ అన్నారు. శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు నిర్దేశిత ప్రణాళికలను అనుసరించాలన్నారు.పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

సంకల్ప యాత్రకు తరలిన నాయకులు

కామేపల్లి: ఇల్లెందులో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్రకు మండలం నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. బీజేపీ మండలాధ్యక్షుడు జర్పుల రామారావు ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు భారీ మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. భాగం రామారావు, భూక్యా శ్రీనునాయక్, పోలూరి చంద్రయ్య, కొమ్మినేని భద్రయ్య, జాలె శ్రీనుయాదవ్, బసవయ్య పాల్గొన్నారు.

గొర్రెల సొసైటీ పాలకవర్గం ఏకగ్రీవం



ఎన్నికైన కమిటీకి పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి రవికుమార్

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి శ్రీ మురళీకృష్ణ ప్రాథమిక గొర్రెల పెంపకందారుల పారిశ్రామిక సహకార సంఘం పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మొత్తం ఏడుగురు సొసైటీ డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా మంగళవారం నూతన కమిటీ ఆఫీస్ బేరర్లును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి, జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ సి.హెచ్.రవికుమార్ సమక్షంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా మల్లేబోయిన ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా నూక వెంకటేశ్వరరావు, ఆఫీస్ బేరర్స్‌గా కనకబండి కనకనాగరాజు, బాలిన కృష్ణ రాజు, చల్లా కృష్ణ, పొదిల గురులక్ష్మి, బొమ్మ కృష్ణ వేణి ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మల్లేబోయిన శ్రీనివాసరావు, కనకబండి రమేష్, కనకబండి సీతారాములు, నూక హనుమంతరావు, బాలిన నారాయణ, చంద్రకాని మధు, వెంకటప్పయ్య, మల్లేబోయిన సైదులు, బుర్ర గంగయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని పంచాయతీ కార్యదర్శి కె. నాగేశ్వరరావు ఘనంగా సన్మానించారు.

పాఠశాలల్లో స్నానపు గదులు ఏర్పాటుచేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: పాఠశాలల్లో స్నానపు గదులను ఏర్పాటు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వీపీ.గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ... ఎన్నికల విధులు రెండు రోజులు చేయాల్సి వచ్చినప్పుడు స్నానం చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తెలిసిన వారి ఇళ్లకు వెళ్లాల్సి వస్తుందని, దీని వల్ల పలు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఈ మేరకు సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ హామీనిచ్చారన్నారు. నాయకులు వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేపకుంట్లలో తీరిన దాహార్తి



బోరు వద్ద నాయకులు, గ్రామస్తులు

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల వాసులు తాగునీటికి ఇబ్బంది పడుతున్న విషయంలో తెలియడంతో రాష్ట మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణ పరిష్కారంగా బోర్ వేయించారు. పదిహేను రోజుల క్రితం సమస్యను కాంగ్రెస్ నాయకులు అర్వికట్ల ప్రేమ్‌కుమార్, బండి నాగేశ్వరరావు, ఆర్వికట్ల సుధీర్, చల్లగుండ్ల శ్రీనివాసరావు, ఉప్పెర్ల రామయ్య తదితరులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి సూచనల మేరకు బోర్ వేయించిన అధికారులు మంగళవారం మోటార్ అమర్చారు. ఈమేరకు తాగునీటి సమస్య తాత్కాలికంగా పరిష్కారమవడంతో గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

మట్టి రవాణాను అడ్డుకున్న పోలీసులు

నేలకొండపల్లి: అక్రమంగా మట్టి తరలిస్తున్న అంశంపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగారు. మండలంలోని వివిధ గ్రామాల్లో విచ్చలవిడిగా మట్టిని తవ్వి అమ్ముకుంటుండగా, స్థానికుడు పసుమర్తి శ్రీనివాస్ తదితరులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు రెండు రోజుల క్రితం బోదులబండలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను అడ్డుకున్నారు. ఇక మంగళవారం కొత్తకొత్తూరు నుంచి టిప్పర్ల ద్వారా వెంచర్లకు మట్టి తరలిస్తుండుగా పోలీసులు వాహనాలను నిలిపివేశారు.

నీటి వనరులను వినియోగంలోకి తేవాలి



అలుగు బావిని పరిశీలిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని నగర ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగంలోకి తీసుకురావాలని నగర మేయర్ పునుకొల్లు నీరజ అధికారులను ఆదేశించారు. మంగళవారం 41వ డివిజన్‌లోని లకారం చెరువు వద్ద గల అలుగు బావిని, చేతిపంపులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... 150 ఏళ్ల చరిత్ర కలిగిన అలుగు బావిని వినియోగంలోకి తీసుకొచ్చి స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. బావికి చుట్టు ఉన్న మొక్కలను తొలగించి, పూడిక తీసి, రక్షణ గోడలకు మరమ్మతులు చేయాలన్నారు. ఇప్పటికీ భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, రాబోయే రోజుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుందని అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, డీఈ నవ్యజ్యోతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్, బోర్స్ రిపేర్ ఇన్‌చార్జ్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం



నేలకొండపల్లి: కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ రమ్య

నేలకొండపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని ఎంపీపీ వజ్జా రమ్య అన్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ప్రారంభం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలో ఎంపీటీసీ, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు రేగూరి వాసవి ఆధ్వర్యంలో మంగళవారం కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వజ్జా రమ్య మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన వరాలు నేరవేర్చిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల లో కాంగ్రెస్ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు దోసపాటి కల్పన, వాసవి, జెర్రిపోతుల సత్య నారాయణ, కందిమళ్ల హరిబాబు, రాయపూడి నారాయణ, రేగూరి హనుమంతరావు, కడియాల నరేష్, వజ్జా శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



రఘునాథపాలెం: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

రఘునాథపాలెం: ఉచితవిద్యుత్, రూ.500కు గ్యాస్ పథకాలను ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని చింతగుర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాలోత్ లక్ష్మి, మాజీ సర్పంచ్ తమ్మిన్ని నాగేశ్వరరావు, కేతినేని సీతారామయ్య, సుదగాని గోపయ్య, కొత్తా కోమరయ్య, సురేష్, మహ్మద్‌ఆలీ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంపై పోరాడాలి



నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో నూతన జాతీయ విద్యా విధానంపై పోరాడాలని, విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు రావి శివరామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా స్థానిక యూనివర్సిటీ అనుబంధ పీజీ కళాశాలలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రావి శివ రామకృష్ణ మాట్లాడుతూ..బీజేపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన విద్యా విధానం పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా ఉందన్నారు. ప్రభుత్వ రంగంలో విద్యను తొలగించి కార్పొరేట్ శక్తులకు విద్యారంగాన్ని అప్పచెప్పే ఆలోచన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కౌశిక్, నాయకులు గోపి, అయ్యప్ప, రాకేష్, ప్రతాప్, రాజు, సునీల్, సృజన్, వెంకట్, సాయి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

కామేపల్లి: గ్రామాల్లో వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని డీఎల్‌పీఓ కీర్తి ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పన్నుల వసూలుకు చెందిన రికార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని, వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యదర్శులు పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీల సంఖ్య పెంచాలి

కామేపల్లి: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచేందుకు ఈజీఎస్ సిబ్బంది కృషి చేయాలని ఏపీడీ వెంకటపతిరాజు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో ప్రతీ కూలీకి పని దినాలను, పని ప్రదేశాల్లో కూలీలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని, నర్సరీల్లో పెంచే మొక్కలు ఎండ తీవ్రతకు దెబ్బతినకుండా షెడ్ నెట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, ఏపీఓ శ్రీరాణీ, టీఏఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సెమీస్ దశకు చేరిన కేపీఎల్

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఖమ్మం ప్రీమియర్ లీగ్(కేపీఎల్) క్రికెట్ టోర్నీ సెమీస్ దశకు చేరింది. ఈమేరకు మంగళవారం జేవీడీ చిటాస్– అభయ అవెంజర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో జేవీడీ చటాస్ గెలిచి సెమీఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది. పోటీలను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టోర్నీ నిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ ప్రారంభించగా, మతిన్, ఓలేటి సాంబమూర్తి, లక్ష్మణ్, నరేష్, వెంకట్, శ్రీకాంత్, సందీప్ ఆర్య పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం



వార్షికోత్సవ వేడుకల్లో తుమ్మల, తదితరులు

ఖమ్మం సహకారనగర్: వికాస్ పాఠశాల వార్షికోత్సవాన్ని నగరంలోని సీక్వెల్ ప్రాంగణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా విద్యార్థులు చేసిన నత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలు ముఖ్యమన్నారు. ప్రతీ విద్యార్థిని కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం డీఈఓ సోమశేఖర శర్మ మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధనలో మార్పులు అవసరమన్నారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ వై. లావణ్య, ఫేమా కన్వీనర్ ఎం.శ్రీనివాసరావు, కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల, ప్రైవేట్ పాఠశాల సంఘం జిల్లా అధ్యక్షుడుగుర్రం కాంతారావు, దుర్గాప్రసాద్, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా భట్టు



కామేపల్లి: బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా గరిడేపల్లి గ్రామానికి చెందిన భట్టు నాగేశ్వర రావు నియమితులైనట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అన్ని వర్గాల పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. తనకు పార్టీలో సేవ చేసేందుకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్: ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని, అలాచేస్తే ప్రాణాప్రాయస్థితిలో ఉన్న వారిని కాపాడినట్టేనని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎన్.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నగరంలోని డీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాని ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాడెంట్ వి.మోహన్ రెడ్డి, ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ బాలు, ఎన్‌సీసీ అధికారి నాయక్, భావక్‌పటేల్, చైర్మన్ వి.శోభరెడ్డి, ప్రిన్సిపాల్ టి.నాగేశ్వరరావు, రమణరావు, బి.వెంకటకృష్ణ, యాదగిరి, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.